క్లుప్తంగా

సొంత నిధులతో బోరింగ్ మరమ్మతులు



కాచిగూడ: వేసవిలో నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గ ప్రజలకు నీటి ఇబ్బందులు లేకుండా బోరింగ్‌కు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సొంత నిధులతో మరమ్మతులు చేయిస్తున్నారని బీఆర్‌ఎస్ నేతలు తెలిపారు. సోమవారం గోల్నాక డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మొత్తం 3 బోరింగ్‌లకు మరమ్మతులు చేయించినట్లు సమాచారం. బీఆర్‌ఎస్ నాయకుడు సంతోష్, రాజు, ప్రభాకర్, దేవేందర్, చారి తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి సంగీతం దోహదం



చిక్కడపల్లి: మానసిక ఉల్లాసానికి సంగీతం దోహదపడుతుందని సూర్యోదయ ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్ట్ సీఈఓ డాక్టర్ సురేఖరెడ్డి అన్నారు. ఘంటసాల శత జయంతి సందర్భంగా కళాంజలి కళాపరిషత్ సాంస్కృతిక సేవ సంస్థ ఆధ్వర్యంలో సినీ సంగీత విభావరి సోమవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ సురేఖరెడ్డి పాల్గొని జ్యోతి ప్రజల్వన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఒత్తిడులను ఎదుర్కోవడానికి సంగీతం ఉపయోగపడుతుందన్నారు. గాయకుడు వేణు మాస్టర్, బుర్ర మోహనకృష్ణ పాల్గొన్నారు.

బాలలను ఒత్తిడికి దూరంగా పెంచాలి



చిక్కడపల్లి: బాలలను ఒత్తిడికి దూరంగా పెంచాలని ప్రముఖ కవి, రచయిత విశ్వనాథ్ అన్నారు. మరింగంటి కృష్ణమాచారి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం త్యాగరాయ గానసభలోని కళాదీక్షితులు కళావేదికలో విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలు ఇంజినీర్లు, డాక్టర్లు అవుతున్నారని.. కళలపై వారికి ఆసక్తిని ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వాహకులు మరింగటి లక్ష్మణాచారి, సంస్థ సభ్యులు రామాచార్య, విజయగోపాలాచార్య తదితరులు పాల్గొన్నారు.

భవనంపైనుంచి పడి వ్యక్తి మృతి

కాచిగూడ: ప్రమాదవశాత్తు భవనంపైనుంచి ఓ వ్యక్తి కిందపడి మృతి చెందిన ఘటన నారాయణగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ నరేష్‌కుమార్ (33) జీవనోపాధి కోసం నగరానికి వచ్చాడు. నారాయణగూడలో నూతనంగా నిర్మిస్తున్న ఓ భవనంలో పనిచేస్తూ.. అక్కడే ఉంటున్నాడు. భవనంలోని రెండో అంతస్తు కిటికీ సమీపంలో నిద్రిస్తున్న అతడు ఆదివారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. శబ్దం రావడంతో తోటి కార్మికులు కిందకు వెళ్లి చూడగా.. తీవ్రంగా గాయపడిన నరేష్‌కుమార్ కొట్టుమిట్టాడుతున్నాడు. దీంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అతడిని గాంధీ ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. సోమవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అసభ్య మెసేజ్‌లు పంపిన యువకుడికి 5 రోజుల జైలు

అంబర్‌పేట: సోషల్ మీడియాలో వివాహితకు అసభ్యంగా మెసేజ్‌లు పెట్టిన ఓ యువకుడికి న్యాయస్థానం 5 రోజుల జైలుశిక్ష విధించింది. ఈ ఘటన సోమవారం అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం.. వారం రోజుల క్రితం అంబర్‌పేటలో నివసించే ఓ వివాహిత పట్ల చెంగిచెర్లకు చెందిన యువకుడు నాగేష్ (23) అసభ్యంగా మెసేజ్‌లు పెట్టాడు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. అనంతరం కోర్టు ఎదుట హాజరు పరచగా.. అతడికి నాంపల్లి 8వ స్పెషల్ మెట్రోపాలిటిన్ కోర్టు న్యాయమూర్తి 5 రోజుల జైలు శిక్ష విధించారు.

మహిళా శక్తిని వినియోగించుకోవాలి

చిక్కడపల్లి: మహిళా శక్తిని వినియోగించుకుంటే ప్రపంచంలో అగ్రరాజ్యాల సరసన భారతదేశం నిలుస్తుందని తెలంగాణ శాసన సభ తొలి స్పీకర్ మధుసూదనాచారి అన్నారు. సోమవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ అధ్యక్షులు కళా వీఎస్ జానార్దనమూర్తి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ సంఘ సేవకురాలు శ్రీవాణికి ఆయన మహిళాపురస్కారం అందజేసి ఘనంగా సత్కరించారు. మాజీ స్పీకర్ మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితిలో అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని ఇది మంచి శుభసూచకమన్నారు. హైదరాబాద్‌లోని అన్ని దేవాలయాలను సందర్శిస్తే పవిత్రత లభిస్తుందో.. ఒక్క త్యాగారాయగాన సభను దర్శిస్తే ఆ పవిత్రత లభిస్తుందన్నారు. బ్రహ్మణభవన్ వ్యవస్థాపకులు గిరిప్రసాద్‌శర్మ, కె.శైలజ, గానసభ పాలకవర్గసభ్యులు బండి శ్రీనివాస్ తదితరులున్నారు.

‘దేశ ఆర్థిక ఆధిపత్యం కార్పొరేట్ శక్తులకు అప్పగింత’..

కాచిగూడ: ‘దేశ ఆర్థిక ఆధిపత్యాన్ని కార్పొరేట్ శక్తులకు ప్రస్తుత పాలకులు అప్పగించారని’ ప్రముఖ సామాజిక వేత్త ప్రొ. రమా మేల్కొటే విమర్శించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా భారత జాతీయ మహిళా సమాఖ్య, శ్రామిక మహిళాఫోరం సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం హిమాయత్‌నగర్ ముఖ్దూమ్ భవన్‌లో ‘లౌకికవాదాన్ని పరిరక్షించండి – అధిక సంఖ్యాక బుజ్జగింపు ధోరణిని ఓడించండి’ అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశంలో క్రమేణ నిరంకుశత్వం పెరుగుతోందని, ప్రైవేటీకరణ నేపథ్యంలో సంక్షేమ రాజ్యం లేకుండా పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలు తమ హక్కులు, సమస్యల పరిష్కారానికి ప్రతిరోజూ పాలకులను ప్రశ్నిస్తూనే ఉండాలని ఆమె సూచించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పద్మ, ప్రేమ్‌పావని, సృజన, జ్యోతి, సదాలక్ష్మి, చాయాదేవి, అరుణకుమారి, నళిని, కృష్ణకుమారి, నీలమ్మ, మాధవి, హైమావతి, జ్యోతి శ్రీమాన్, కల్పన, కమలారెడ్డి తదితరులున్నారు.



శ్రీవాణిని సత్కరిస్తున్న మధుసూదనాచారి తదితరులు

మహిళా సిబ్బందికి మరిన్ని మెరుగైన వసతులు..

కాచిగూడ: రైల్వేలో పనిచేస్తున్న మహిళా సిబ్బందికి మరిన్ని మెరుగైన వసతులను కల్పిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ డివిజన్ ఉమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు, డీఆర్‌ఎం శరత్ చంద్రాయన్ సతీమణి రజని పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కాచిగూడ రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మహిళా విశ్రాంతి గదులను ఆమె సోమవారం ప్రారంభించారు. విధి నిర్వహణలో ఉన్న మహిళా లోకో పైలెట్లు, టీటీఐలు, మహిళా సిబ్బంది విశ్రాంతి తీసుకోవడానికి ఈ విశ్రాంతి గదులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. మహిళా సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రైల్వే యాజమాన్యం ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. మహిళా ప్రయాణికుల భద్రతకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నామన్నారు. సంస్థ ఉపాధ్యక్షులు మల్లిక, మంజుల, నీల పావని, కొండ అనురాధ, అర్చనా రేచల్, ఎస్‌వీఎస్ కుమారి, రైల్వేస్టేషన్ డైరెక్టర్ ప్రభుచరణ్ తదితరులు పాల్గొన్నారు.

చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలి..

కవాడిగూడ: మహిళలకు చట్టసభల్లో రాజకీయ రిజర్వేషన్లు కల్పిస్తే వారు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య అన్నారు. సోమవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లో నిర్వహించిన మహిళాదినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజకీయాల్లో మహిళల పాత్ర పెరుగుతోందని చట్టసభల్లోనూ వారి ప్రాతినిధ్యం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణ మోహన్‌రావు, కవాడిగూడ డివిజన్ కార్పొరేటర్ రచనశ్రీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందగోపాల్, రాజ్‌కుమార్, రామకృష్ణ, శ్రీదేవి, సీత, శ్రీనివాస్, బాబు, కుమారస్వామి తదితరులున్నారు. అనంతరం అతిథులు సామాజిక సేవా కార్యకర్త పద్మను ఘనంగా సత్కరించారు.



పద్మను సన్మానిస్తున్న వకుళాభరణం, ఆర్. కృష్ణయ్య తదితరులు

మహిళలకు రక్షణ కల్పించాలి..

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దేశంలో మహిళలకు సంపూర్ణ రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని ప్రొఫెసర్ సూర్యధనుంజయ్ అన్నారు. సోమవారం నవ తెలంగాణ పబ్లిషింగ్ హౌజ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న మహిళలు, విద్యావంతులు, మేధావులు, విద్యార్థులు మంచి మంచి పుస్తకాలను తీసుకొస్తున్నారని ఆ పుస్తకాలను విద్యార్థి దశ నుంచే అభ్యసించాల్సిన అవసరం ఉందన్నారు. ఆనందాచారి, సలీమా, కృష్ణారెడ్డి, రఘు, సుభాషిణి తదితరులున్నారు.

సయోధ్య కుదిరిందా..?

- మంత్రి కేటీఆర్ ఆదేశాలతో కేసు ఉపసంహరణ
- హేమలతకు కార్పొరేటర్‌కు సమానమైన హోదా

ముషీరాబాద్: అడిక్‌మెట్ డివిజన్ కార్పొరేటర్ సునీతాప్రకాష్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ హేమలతాజయరామ్‌రెడ్డిల వివాదం దాదాపుగా సద్దుమనిగినట్లే కనిపిస్తోంది. కార్పొరేటర్ సునీతాప్రకాష్‌గౌడ్ ఇక పార్టీలో చురుకుగా పాల్గొనే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ 10 రోజుల క్రితం వీరిని మంత్రి కేటీఆర్ దగ్గరకు తీసుకెళ్లి సయోధ్య కుదిర్చినట్టు సమాచారం.

- అడిక్‌మెట్ డివిజన్ కార్పొరేషన్ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అభ్యర్థిగా బి.హేమలతాజయరామ్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థిగా సునీతాప్రకాష్‌గౌడ్‌లు పోటీ చేయగా సునీతాప్రకాష్‌గౌడ్ విజయం సాధించారు.
- దీంతో సునితపై హేమలతకు ముగ్గురు పిల్లలు ఉన్నారని ఆమె కార్పొరేటర్‌కు అనర్హురాలని గతంలో వేసిన కేసును తిరిగి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.
- కార్పొరేటర్ సునీత భర్త ప్రకాష్‌గౌడ్ అనారోగ్యంతో మరణించడం, ఆర్థిక ఇబ్బందులు, ముగ్గురు పిల్లల కేసు, ఇతర కారణాలతో మంత్రి కేటీఆర్ సమక్షంలో ఏడాది క్రితం టీఆర్‌ఎస్‌లో చేరారు. దీంతో కార్పొరేటర్, మాజీ కార్పొరేటర్ ఇద్దరు ఒకే గూటి కిందకు చేరారు.

కేటీఆర్ వద్ద సయోధ్య..

- కార్పొరేటర్ సునీత టీఆర్‌ఎస్‌లో చేరి పార్టీ కార్యక్రమాల్లో డివిజన్ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనకుండా దూరాన్ని పాటిస్తున్నారు. దీనికి కారణం తనపై ఉన్న కేసును ఉపసంహరించుకోకపోవడమే కారణమని సమాచారం.



మంత్రి కేటీఆర్‌తో కార్పొరేటర్, మాజీ కార్పొరేటర్, ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు (ఫైల్)

- ఇక మాజీ కార్పొరేటర్ కూడా దూరంగానే వ్యవహరిస్తుండటంతో ఇద్దరి మధ్య సమస్యను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే ముఠా గోపాల్ చొరవ తీసుకుని 10 రోజుల క్రితం మంత్రి కేటీఆర్ వద్దకు తీసుకువెళ్లారు.
- ఇద్దరి సమస్యను సానుకూలంగా విన్న మంత్రి కార్పొరేటర్ సునీతపై ఉన్న కేసును ఉపసంహరించుకోవాలని హేమలతకు సూచించారు.
- దీనికి ప్రతిఫలంగా హేమలతకు కార్పొరేటర్‌కు సమానమైన హోదాను ఇస్తామని హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. పార్టీలో ఇద్దరికి భవిష్యత్తులో సముచిత స్థానం కల్పిస్తామని పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని మంత్రి సమాచారం.

కేసు ఉపసంహరణ..

- మార్చి 6 న ముగ్గురు సంతానం కేసు హియరింగ్ ఉండడంతో కేటీఆర్ ఆదేశాల మేరకు సోమవారం సిటీ సివిల్ కోర్టుకు మాజీ కార్పొరేటర్ హేమలత వెళ్లి కేసు ఉపసంహరణ పిటిషన్ దాఖలు చేశారు. దీంతో ఒకే పార్టీలో ఉన్న ప్రస్తుత, మాజీ కార్పొరేటర్ల వివాదానికి తెరపడినట్లేనని పలువురు భావిస్తున్నారు.

‘గంగపుత్రుల హక్కుల సాధనకు అహర్నిశలు కృషి’

కవాడిగూడ: గంగపుత్రుల హక్కుల సాధనకు అహర్నిశలు పాటుపడిన మహోన్నత వ్యక్తి ప్రదేశ్ గంగపుత్ర అధ్యక్షులు దివంగత ఎ.ఎల్ మల్లయ్య అని పలువురు కొనియాడారు. ఎ.ఎల్ మల్లయ్య సంతాపసభ సోమవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని తెలగ బలిజకాపు సంఘం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ, తెలంగాణ నుంచి గంగపుత్ర సంఘం నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏపీ మాజీ మంత్రులు మోపిదేవి వెంకటరమణ, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి ఎం.ఎస్.రావు, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఏపీ బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద్రమౌళి, కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీ హనుమంతరావు, పిషరీస్ డిపార్ట్‌మెంట్ మాజీ చైర్మన్ ధర్మయ్య, ప్రొఫెసర్ సుదర్శన్ తదితరులు పాల్గొని ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకుని నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు సత్యనారాయణ, శ్రీనివాస్, సుధాకర్, సంతోష్, ఎ.ఎల్.లక్ష్మి, ప్రదేశ్ గంగపుత్ర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడప శ్రీహరి, ఉపాధ్యక్షులు శివరత్నం, రాష్ట్ర నాయకులు మల్లేశం, ఆర్.కే.భగవాన్ తదితరులున్నారు.



ఎ.ఎల్ మల్లయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ప్రజల అవసరాలకు అనుగుణంగా ‘కంటి వెలుగు’ శిబిరాలు

ముషీరాబాద్: ప్రజల అవసరాలను బట్టి ‘కంటి వెలుగు’ శిబిరాలను ఏర్పాటు చేస్తామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. సోమవారం ముషీరాబాద్ డివిజన్‌లోని కుమ్మరి సంఘం కమ్యూనిటీహాల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నియోజకవర్గంలో కంటి వెలుగు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. రోజూ ఒక్కొక్క శిబిరంలో 100–150 మంది కంటి పరీక్షలు చేయించుకుంటున్నారన్నారు. అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు సమయం ప్రకారం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ముషీరాబాద్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు నర్సింగ్‌ప్రసాద్, ఆకుల అరుణ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రెడ్డి, పార్టీ నాయకులు పూసగోరఖ్‌నాథ్, శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, గోవింద్, వెంకటేష్, ప్రభాకర్ తదితరులున్నారు.



కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



అంబర్‌పేట: మంత్రి హరీష్‌రావు సహకారంతో పేదల వైద్యానికి తనవంతు సహకారం అందిస్తున్నట్లు బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు దూసరి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. బాగ్‌అంబర్‌పేట కుమ్మరిబస్తీకి చెందిన ఫాతీమాబేగం కుటుంబ సభ్యులకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.60 వేల చెక్కును సోమవారం గోల్నాకలోని ఆయన కార్యాలయంలో అందజేశారు. గోల్నాకతో పాటు నియోజకవర్గంలో ప్రభుత్వ పథకాలు అందేలా తనవంతు కృషి చేస్తానన్నారు.

నారీ శక్తి పురస్కారాల ఆహ్వానపత్రం ఆవిష్కరణ



చిక్కడపల్లి: కళాదర్బార్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 8న త్యాగరాయగానసభలో మహిళా దినోత్సవం సందర్భంగా ఝాన్సీ లక్ష్మీబాయి నారీశక్తి పురస్కారాలను ప్రదానం చేస్తున్నట్లు ఆ సంస్థ నిర్వాహకులు పొత్తూరి రంగారావు ప్రకటించారు. సోమవారం చిక్కడపల్లిలో గాయనీగాయకులతో కలిసి ఆయన ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సినీనటి సన, జయప్రదరామ్మూర్తి తదితర 9 మంది మహిళలకు ఈ పురస్కారాలను ప్రదానం చేస్తామన్నారు. ముఖ్య అతిథులుగా వాసవీ గ్రూప్ సీఎండీ విజయకుమార్, డైరెక్టర్ వెంకటేశ్వర్‌రావుతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొంటారన్నారు. గాయకులు చింతలపూడి త్రినాథరావు, సురేష్, మాధవి, కళావేదిక ఎడిటర్ భువన రాయవరపు, బిక్కికృష్ణ పాల్గొన్నారు.

పండితులను సత్కరించుకోవాలి



చిక్కడపల్లి: పండితులను సత్కరించుకోవాలని ప్రముఖ సినీనటులు పృథ్వీరాజ్ అన్నారు. జ్యోతిష్యశాస్త్ర పండితులు పెద్దింటి రామంను విశ్వంబరి మూవీ మేకర్స్, భారతి మ్యూజిక్ అకాడమీ త్యాగరాయగానసభలో సన్మానించి విశ్వ కళా చైతన్యభారతి బిరుదును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ.. పాండిత్యం ఉన్న వారిని గౌరవించుకుంటే సమాజానికి ఎంతో మంచి జరుగుతందన్నారు. నిర్వాహకులు సత్యశ్రీ, చింతలపాటి సురేష్, రంగారావు, ఎన్.గోపాలకృష్ణ, బురహాన్, సాయిబాబు తదితరులున్నారు.

‘తెలంగాణ బచావో సదస్సు’ పోస్టర్ ఆవిష్కరణ

చిక్కడపల్లి: మిలియన్ మార్చ్ స్ఫూర్తిగా ఈనెల 10న తెలంగాణ జనసమితి వీఎస్‌టీ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ బచావో సదస్సుకు ముషీరాబాద్ నియోజవర్గం తెలంగాణ జనసమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు, ముషీరాబాద్ ఇన్‌చార్జ్ నర్సయ్య విజ్ఞప్తి చేశారు. నియోజవర్గ కన్వీనర్ శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో అశోక్‌నగర్‌లో ‘బచావో సదస్సు’ పోస్టర్‌ను సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణను రక్షించుకోవాల్సిన బాధ్యత తెలంగాణ ఉద్యమకారులపై ఉందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ ఉద్యమంలో మిలియన్ మార్చ్‌లో కీలకంగా పాల్గొన్న ముషీరాబాద్ నియోజవర్గం ఉద్యమకారులందరూ ఈ సదస్సుకు హాజరుకావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ జనసమితి నగర ప్రధాన కార్యదర్శి రాంచందర్, బీసీ జన సమితి నగర అధ్యక్షుడు ఎస్. జస్వంత్‌కుమార్, నగర నాయకుడు జైపాల్‌రెడ్డి, సుధాకర్, లక్ష్మణ్ అశ్వక్, గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు రవిందర్‌యాదవ్, కవాడిగూడ అధ్యక్షుడు అజయ్‌గౌడ్, అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు సుధాకర్, నగర నాయకులు తదితరులున్నారు.



‘దర్పణం’ కథా సంపుటి పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో పద్మ, ప్రొఫెసర్ డాక్టర్ రమా మేల్కోటే తదితరులు

కాచిగూడ: ఉద్యమనేతగా ప్రజల జీవన స్థితిగతులపై అవగాహన ఉన్న కమలారెడ్డి రచనలు సందేశాత్మకమైనవని పలువురు వక్తలు పేర్కొన్నారు. సోమవారం హిమాయత్‌నగర్ ముఖ్దూమ్ భవన్‌లో ప్రముఖ రచయిత్రి కమలరెడ్డి రచించిన ‘దర్పణం’ కథా సంపుటి పుస్తకాన్ని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు పద్మ, ప్రముఖ సామాజిక వేత్త ప్రొ. డాక్టర్ రమా మేల్కొటేతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ‘కమల రచనలు ఊహల్లో నుంచి ఊబికి వచ్చినవి కావని, జీవిత అనుభవాల్లో నుంచి పుట్టుకొచ్చినవని’ తెలిపారు. ‘సామాజిక అసమానతలు, మనిషికీ మనిషికీ మధ్య ఉత్పన్నమయ్యే ఘర్షణ, పలు సందేశాత్మక అంశాలు ఉన్నాయన్నారు. తెలంగాణ రాష్ట్ర గ్రామిక మహిళా వేదిక కన్వీనర్ ప్రేమ్‌పావని, ఎస్.ఛాయాదేవి, జ్యోతి, ఉస్తెల సృజన, డాక్టర్ రజని, నళిని, కృష్ణకుమారి తదితరులున్నారు.

ఘనంగా పాఠశాలల వార్షికోత్సవం



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం



వార్షికోత్సవంలో నృత్యం చేస్తున్న విద్యార్థులు

కవాడిగూడ: బచ్‌పన్ ప్లే స్కూల్‌లో ఘనంగా 14వ యూకేజీ అండర్ గార్డెన్ వారోత్సవాలను దోమలగూడలో సోమవారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు శ్లోకాలు, భక్తిగీతాలు, పద్యాలు ఆలపించారు. పాఠశాల డైరెక్టర్లు శ్రీధర్‌రెడ్డి, రూపారెడ్డి పాల్గొని చిన్నారులను ప్రత్యేకంగా అభినందించి సర్టిఫికెట్లను అందజేశారు. బాల్యం నుంచే చిన్నారులకు క్రమ శిక్షణ, దేశభక్తి, సంస్కృతి, సంప్రదాయాలపై తల్లిదండ్రులు ప్రొత్సహించాలని అప్పుడే వారి భవిష్యత్తుకు బంగారు బాటలు పడతాయన్నారు. ప్రిన్సిపాల్ కె.భవానీ తదితరులున్నారు.

విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి..

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దేవీ హైస్కూల్ అంబర్‌పేట భరత్‌నగర్ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ.. విద్యతో పాటు విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా ప్రొత్సహించాలని సూచించారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సంస్కృతిక కార్యక్రమాలు సభికులను ఆకట్టుకున్నాయి. పాఠశాల కరస్పాండెంట్ ఎండీ ఖాజాపర్వుద్దీన్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు ఉషాశ్రీకాంత్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీరాములుముదిరాజ్, బీజేపీ నాయకులు అజయ్, స్కూల్ ప్రిన్సిపాల్ ఫర్హానాబేగం, టీచర్లు కల్పన, రేఖ, అనిత పాల్గొన్నారు.

సాత్విక్ ఆత్మహత్యకు కారణమైన వారిని శిక్షించాలి

ముషీరాబాద్: సాత్విక్ ఆత్మహత్యకు కారణమైన నిందితులను శిక్షించడానికి కేసు ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నగేషముదిరాజ్ డిమాండ్ చేశారు. సోమవారం ముషీరాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటు కళాశాలల ఆగడాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయన్నారు. విద్యార్థులను వేధింపులకు గురిచేస్తూ.. వారు ఆత్మహత్య చేసుకునేలా అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. సాత్విక్ విచారణ కమిటీ నివేదికలో విస్తు పోయే నిజాలు వెలుగు చూశాయన్నారు. విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేయడమే కాక, భౌతిక దాడులు చేస్తున్నారని ఆరోపించారు. సాత్విక్ తన సూసైడ్ నోట్లో ఇలాంటి ఘటనలు నాతోనే ఆగిపోవాలని కోరడం కలచి వేసిందన్నారు. విదేశాల్లో చదువుకున్న మంత్రి కేటీఆర్ చోద్యం చూస్తున్నారన్నారు. అక్కడ విద్యార్థులకు ఏ హక్కులు ఉన్నాయో ఆ విధంగానే ఇక్కడ అమలు చేయాలని దోషులకు శిక్ష పడేలా చూడాలన్నారు. లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

పాఠశాలకు ఆట వస్తువుల అందజేత

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని ఆంధ్రమహిళ సభ రామచంద్రం బాలికల పాఠశాల విద్యార్థులకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు ఆట వస్తులను పంపిణీ చేశారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో బ్యాంక్ కోఠి డీజీఎం ప్రమోద్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. సామాజిక సేవ కార్యక్రమంలో భాగంగా పేద విద్యార్థులు చదివే పాఠశాలలకు ఆట వస్తువులతో పాటు అల్మారా, వాటర్, ఎయిర్ కూలర్లు అందజేశామన్నారు.

ప్రైవేటు హాస్టళ్ల నియంత్రణకు చట్టం తీసుకురావాలి

కాచిగూడ: రాష్ట్రంలో ఇష్టానురీతిన వెలుస్తున్న ప్రైవేటు వసతి గృహాల (హాస్టళ్ల) నియంత్రణకు ప్రభుత్వం చట్టం తీసుకురావాలని తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం కాచిగూడలోని బీసీ మహాసభ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ వసతి గృహాల్లో వసూలు చేస్తున్న అధిక ఫీజులతో బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు మోయలేని భారంగా మారుతుందన్నారు. ఉన్నత విద్య కోసం వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చే విద్యార్థులకు సరైన సౌకర్యాలు లేక తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ హాస్టళ్లలో ఉంటున్నారన్నారు. హాస్టళ్లపై ప్రభుత్వ నియంత్రణ లేకపోవడంతో హాస్టళ్ల యాజమాన్యాలు తమ ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో నెలకు రూ.5 వేల వరకు ఉంటే ప్రస్తుతం రూ.10వేల వరకు వసూలు చేస్తున్నారన్నారు. బీసీ నేతలు కృష్ణ, ముత్యాలరావు, సాంబశివగౌడ్, ప్రశాంత్‌నిమ్‌కర్, నాగేశ్వర్‌రావు, తుంగబాబు, శ్రీకాంత్ వాసు తదితరులున్నారు.

ఇంటింటికీ ‘హాథ్ సే హాథ్ జోడో యాత్ర’

కవాడిగూడ: కాంగ్రెస్ ‘హాథ్ సే హాథ్ జోడో యాత్ర’కు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఇంటింటికీ వివరిస్తూ.. కరపత్రాలు పంపిణీ చేస్తున్నామన్నారు. భవిష్యత్తులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు గుణపాఠం చెప్పి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. సోమవారం కవాడిగూడ డివిజన్‌లోని ఉన్నికోట, చిత్రాల నగర్ బస్తీలలో ఆయన పర్యటించారు. మాజీ కార్పొరేటర్ కల్పనాయాదవ్, ముషీరాబాద్ ఎ–బ్లాక్ అధ్యక్షుడు కృష్ణ, నగర కాంగ్రెస్ నాయకులు లక్ష్మణ్, రాష్ట్ర నాయకులు యాదగిరి, డివిజన్ అధ్యక్షులు ధర్మేందర్, మాజీ ఉద్యోగులు సాయిబాబా, నాయకులు రమేష్‌యాదవ్, మల్లేష్ యాదవ్, భాస్కర్, రుషికేశ్వర్, శీలం సత్యనారాయణ, రిజ్వాన్, పాశంఅనిల్, బబ్లూయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయ కమిటీలో స్థానికులకే సభ్యత్వం కల్పించాలి

కవాడిగూడ: షిరిడీ సాయిబాబా దేవాలయ కమిటీలో స్థానికులకే సభ్యత్వం కల్పించాలని ఎస్‌బీఐ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం భోలక్‌పూర్ డివిజన్ గాంధీనగర్‌లో ఎస్‌బీఐ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయాన్ని కాలనీవాసుల విరాళాలతోనే 1991లో నిర్మించామన్నారు. ఆలయ ట్రస్ట్ చైర్మన్ రామారావు ఏకపక్ష నిర్ణయాలతో కాలనీకి సంబంధం లేని వారిని కమిటీలోకి తీసుకున్నారని ఆరోపించారు. ఈ విషయంపై పోలీసులకు సైతం ఫిర్యాదు చేశామన్నారు. కొంత మంది తమ స్వార్థం కోసం ఆలయ నిర్వహణను రాజకీయం చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. సేవ చేసేందుకు కాలనీవాసులకే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఎస్‌బీఐ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ డైరెక్టర్ శంకర్‌గౌడ్, నాయకులు కృష్ణమూర్తి, సరళ, రామచంద్రారావు, లక్ష్మణ్, వెంకట్‌ప్రసాద్, ఉమాకాంత్‌శర్మ, వినయ్, పాండు, దత్తాత్రేయ తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఎస్‌బీఐ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ